మునిపల్లె లక్ష్మీ రమణకుమారి

# కల్తీ లేని ప్రేమ

మిసెస్ జయకర్‌తో మాట్లాడుతోంది హారిక.

ఫోన్ గణగణ మోగింది.

"హలో" రిసీవ్ చేసుకొంది హారిక.

"హలో హిమవంత్‌గారి ఇల్లేనా"

"అవును"

"ఎవరు మాట్లాడుతున్నారు"

"వారి మిసెస్‌ని మాట్లాడుతున్నాను"

"హిమవంత్‌గారికి యాక్సిడెంట్ అయింది. ఆరోగ్య క్లినిక్‌లో ఉన్నారు. మీరంతా వెంటనే రావాలి" అవతల ఫోన్ పెట్టేశారు.

హారిక కాళ్ళు చేతులు వణికాయి. చేతిలోంచి రిసీవర్ జారిపోయింది. అలాగే సోఫాలో కూలబడిపోయింది.

"ఏమైందంటే... ఏమైంది" మిసెస్ జయకర్ కంగారుగా ప్రశ్నించింది.

"వారికి యాక్సిడెంట్ అయిందట" హారిక మాటలు నూతిలోంచి వచ్చినట్లు ఉన్నాయి.

"అరెరె... ఎక్కడున్నారట. మీ పేరెంట్స్‌కి ఫోన్ చేస్తాను నెంబరివ్వండి. మనం ఇప్పుడే బయల్దేరుదాం"

మిసెస్ జయకర్ హారిక తల్లిదండ్రులకు ఫోన్ చేసింది.

"మేము ఇట్నుంచి హాస్పిటల్‌కి బయల్దేరుతాం. మీరు శ్రమ అనుకోకపోతే హారికను తీసుకొని హాస్పిటల్‌కి వస్తారా"

"ఓకే. నో ప్రాబ్లమ్" మిసెస్ జయకర్ హామీ ఇచ్చింది. ఇంతలో హడావుడి చూసి చుట్టుపక్కల వాళ్ళంతా వచ్చారు.

"ఏం జరిగింది"

"యాక్సిడెంట్ హిమవంత్‌గారికి"

"అయ్యో ఎక్కడున్నారు ఆయన".

"ఆరోగ్య క్లినిక్‌లో"

ఇరుగుపొరుగులో చాలామంది బయల్దేరారు హారికతో హాస్పిటల్‌కి చేరగానే కళ్లతో మంచం మీద ఉన్న హిమవంత్‌ని చూసి బావురుమని ఏడ్చింది హారిక.

"ఊరుకో తల్లీ ఊరుకో నయమౌతుందిలే" తల్లీ తండ్రీ ఓదార్చారు.

"భగవంతుడా నువ్వే దిక్కు" హారిక తల్లి మౌనంగానే దేవుణ్ణి ప్రార్థించింది.

"ఊరుకోండి హారికా నయమౌతుంది" పక్కింటి మిసెస్ వినయ్ సముదాయించింది.

"డాక్టర్‌గారూ..." హారికతల్లి అపుడు అక్కడికి వచ్చిన పెద్ద డాక్టర్‌గారిని ఏదో అడగబోయింది.

"ఈ రాత్రి దాటితేగానీ చెప్పలేనమ్మా. పరిస్థితి కొంచెం సీరియస్‌గానే ఉంది" అన్నారు డాక్టర్‌గారు.

ఏడుస్తూ హిమవంత్ దగ్గరే కూర్చుంది హారిక.

"పాపం నిండా పాతికేళ్ళు లేవు"

"పెళ్ళయి రెండేళ్ళే"

"తగ్గుతుందో లేదో"

"ఏమో చెప్పలేం"

చిన్నగా మాట్లాడుకొంటున్న ఇరుగుపొరుగు మాటలు విని హారిక ఏడుపు రెట్టింపయింది.

ఏడుస్తున్న హారికను ఓదార్చారు వాళ్ళు.

ఇంతమంది తనపట్ల సానుభూతి చూపటం చూసి హారిక మనసు కరిగిపోయింది.

పాపం తన కోసం నిద్రమానుకొని ఎంతసేపని ఉంటారు వాళ్ళు.

"మీరు వెళ్ళిపొండి. ఇప్పటికే ఇంటిదగ్గర పనులన్నీ మానుకొని వచ్చారు. మళ్ళీ రేపు పొద్దున్నే వద్దురుగానీ" హారిక తండ్రి అన్నారు వాళ్ళతో.

"ఫర్వాలేదండి. మేము ఉంటాం..." అన్నారు వాళ్ళు.

హారిక తండ్రి బలవంతంపెట్టి వాళ్ళను ఇళ్ళకుపంపాడు. మర్నాటికి కూడా హిమవంత్ పరిస్థితిలో మార్పేమీలేదు. అతని తల్లిదండ్రులకు కూడా కబురువెళ్ళింది. ఊరికి.

రెండు రోజులు గడిచాయి.

హారిక రెండు రోజులకే చాలా బలహీనమైపోయింది. ఆహారం తీసుకోకపోవటంతో కళ్ళులోతుకుపోయి మొహం పీక్కుపోయింది.

హారిక సభ్యురాలైన మహిళామండలి జనం అంతా కూడా వచ్చారు.

వాళ్ళందరినీ చూసి బావురుమంది హారిక.

"కష్టాలొస్తూనే ఉంటాయి. తట్టుకోవాలి" రకరకాల వేదాంతాలు రంగరించి సానుభూతి చూపించారు అంతా.

హిమవంత్ తల్లిదండ్రులు అతని పరిస్థితి చూస్తూనే బెంబేలు పడిపోయారు. ముసలి వాళ్ళు కావటంతో తట్టుకోలేక బి.పి పెరిగి వాళ్ళుకూడా అదే క్లినిక్‌లో చేరాల్సివచ్చింది.

హిమవంత్‌కి నయమౌతుందా... లేదా?

అదే హారిక మిత్రమండలిలోనూ, మహిళా మండలిలోనూ రోజూ జరిగే చర్చ.

"ఏం నయమౌతుంది. అసలు స్పృహ రావటంలేదు. ఇలాగే కోమాలో సంవత్సరాలు తరబడి ఉన్న వాళ్ళను చూశాం" అంది మిసెస్ ప్రమీలా వెంకట్రావ్.

"మా తెలిసినాయన ఒకాయనకు ఇలాగే అయింది. పదిరోజులు కోమాలో ఉన్నాడు. పదకొండోరోజు కల్లా... పాపం పోయాడు" అంది మిస్ ప్రీతి.

"పాపం హారిక... ఆయనపోతే... ఇంత చిన్న వయసులో"

"ఏం చేస్తుంది. పాపం ఖర్మ"

"దురదృష్టం"

రకరకాలుగా జాలి పడుతున్నారు జనం.

రోజూ వెళ్ళి హారికను చూసి వస్తున్నారు.

ఆమెకు కొండంత ఓదార్పునిస్తున్నారు.

"పాపం చదువు ఉంది, అందం ఉంది, ఆస్తి ఉంది. అనుకూల దాంపత్యం. అన్నివిధాలా కరుణించిన దేవుడు ఎందుకిలా చేశాడో" సానుభూతి ఒకళ్ళనుమించి మరొకళ్ళు కురిపించటం మొదలుపెట్టారు.

వాళ్ళ ప్రేమాభిమానాలకు, సానుభూతికీ, జాలికీ ఉక్కిరి బిక్కిరయింది హారిక.

పాపం. తనకోసం రోజూ కష్టపడి అంతదూరం నుంచి కార్లేసుకొని వస్తున్నారు.

హారికకూ, తల్లితండ్రులకూ భోజనం కూడా వాళ్ళే ఏర్పాటుచేశారు.

ఏం కావాలంటే అది చేస్తున్నారు.

"నీకేం భయంలేదు హారికా. మేమున్నాం. హిమవంత్‌గారికి నయమైపోతుంది" ఇలాంటి మాటలతో హారిక మనసుని ఓదార్చారు.

* * *

"మీ అదృష్టం హారికగారు... అసలు అతను బతుకుతాడనుకోలేదు. కానీ పరిస్థితి మెరుగ్గా ఉంది. సాయంత్రానికి మాట్లాడవచ్చు" అన్నారు డాక్టర్‌గారు. ఆ రోజు తన బృందంతో హిమవంత్‌ని చూడ్డానికి వచ్చి—

"నిజంగానా డాక్టర్" సంతోషంలో హారికకి గుండె ఆగిపోతుందా అనిపించింది.

"భగవాన్ అంతా నీ దయ" హారిక తల్లి దేవుడికి నమస్కరించింది.

సాయంకాలం కళ్ళు తెరిచాడు హిమవంత్...

"అబ్బా" అంటూ మూలిగాడు.

"ఏమండీ" హారిక అతని దగ్గరకు వచ్చి ఆనందంతో పిలిచింది.

"హారీ... ఏంటి ఎక్కడున్నాం"

"మాట్లాడకండి. రెస్ట్ తీసుకోండి" డాక్టర్ చెప్పారు. హిమవంత్ తల్లిదండ్రులకు వెళ్ళి చెప్పారు ఈ సంగతి.

"నిజంగా లేచాడా మా తండ్రి" ఆనందంతో లేచి కూర్చున్నాడు తండ్రి.

"పదండి. నేను వస్తాను" ఎందరు వారించినా వినకుండా మంచంలోంచి లేచి హిమవంత్‌ని చూడడానికి వచ్చింది అతని తల్లి.

అంతకుముందు మొక్కుకున్న పూజలన్నీ

హారిక రెండు రోజులకే చాలా బలహీనమైపోయింది. ఆహారం తీసుకోక పోవటంతో కళ్ళు లోతుకుపోయి మొహం పీక్కుపోయింది. హారిక సభ్యురాలైన మహిళామండలి జనం అంతా కూడా వచ్చారు.

చేయించటానికి బయల్దేరి వెళ్ళింది హారిక తల్లి.

సాయంత్రానికి వచ్చారు హారిక మిత్రమండలి.

''రండి రండి ఆయన మాట్లాడుతున్నారు. ఇక ఏం భయం లేదని చెప్పారు డాక్టర్‌గారు. రెండుమూడురోజుల్లో ఇంటికి కూడా వెళ్ళిపోవచ్చునని చెప్పారు'' ఆనందంగా చెప్పింది హారిక వాళ్ళతో. వాళ్ల ఆ మాటలకు ఎంత సంతోషిస్తారో అనుకొంది.

''ఆ... తగ్గిందా... అదృష్టమే'' మామూలుగా ఉన్న వాళ్ళ మాటలని చూసి తెల్లబోయింది.

మిస్ ప్రీతి మొహంలో అయితే రవ్వంత అసూయ దాచుకొందామన్నా దాగక బయటకు కనిపించింది.

కొద్దిసేపు కూర్చుని వెళ్ళిపోయారు వాళ్ళు. హిమవంత్ స్పృహలో లేనపుడు చూపించిన సానుభూతి ప్రేమ అభిమానాలు లేవు ఇప్పుడు. పైగా చచ్చిపోతాడనుకొన్న వాడు ఎలా బతికాడో అనే ఆశ్చర్యం, బతికినందుకు హారిక పరిస్థితి బాగైనందుకు వాళ్ళ మాటల్లో బయటపడిపోయాయి.

''హారికగారు అదృష్టవంతులు''

''నేనపుడే అనుకొన్నా ఆవిడది అదృష్టజాతకం అందుకే ఇంకోలా జరగదని''

కళ్ళు తిప్పుతూ రకరకాల అభినయాలు. హారికకు చిరాకెత్తింది వాళ్ళ ధోరణి చూసి.

ఆమెకి అర్థమయింది. వాళ్ళకు కావలసింది ఏదో కాస్త కాలక్షేపం. తప్పంటే నిజంగా సానుభూతి లేదు.

అసలు వాళ్ళకెందుకుండాలి?

ఈ లోకంలో నిజమైన ప్రేమ ఆప్యాయతలు దొరికేది తల్లిదండ్రుల దగ్గర, భర్త దగ్గర మాత్రమే.

మిగతావన్నీ సహజమైన ప్రేమలుకావు. కల్తీలేని ప్రేమ తల్లితండ్రులది భర్తది మాత్రమే. మంచి స్నేహితులు ఉండవచ్చు. మన బాగుకోరే వాళ్లు. కానీ అలాంటి వారు అరుదుగా దొరుకుతారు.

మిగతావాళ్ల చాలామందికి ఇవతల వాళ్ళను చూస్తే అసూయ. వాళ్ల బాగుపడిపోతే కుళ్ళు.

మనిషికేమైనా కష్టం వస్తే మాత్రం కొండంత సానుభూతి చూపిస్తారు.

మళ్ళీ ఆ కష్టంలోంచి బయటపడి మామూలు మనిషి కాగానే యథాప్రకారం అసూయ ఆక్రమిస్తుంది హృదయాన్ని.

దానికి బాధపడి ఏం ప్రయోజనం. మన సంతోషం చూసి వాళ్లు సంతోషించలేదని అనుకొని ఏం లాభం.

లోకంతీరు ఇంతే.

కల్తీలేని ప్రేమ వెతకకూడదు ఈ లోకంలో.

హారిక హిమవంత్‌ల తల్లితండ్రుల మొహాల్లో దాచినా దాగని ఆనందం.

హిమవంత్ చేతిని పట్టుకొంది ప్రేమగా హారిక.

ఆమె కళ్ళల్లోంచి ఆనందబాష్పాలు కారాయి అతను కోలుకున్నందుకు.

''అంతేకాదు. ఒక పాఠం కూడా నేర్చుకొన్నాను'' అనుకొంది మనసులో

*

